క్లుప్తంగా

నేడు మార్కాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం టౌన్: పట్టణంలోని 18వ వార్డులో ఉన్న 11వ సచివాలయం పరిధిలోని పవర్ ఆఫీస్ వెనుక ప్రాంతం నుంచి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తునట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని సూచించారు.

సబ్సిడీపై టీఎంఆర్ దాణా

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు సబ్సిడీపై టీఎంఆర్ దాణాను అందుబాటులోకి తీసుకుకొచ్చిందని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని పుల్లలచెరువు పశువైద్యాధికారి డాక్టర్ నాగుల్‌మీరా తెలిపారు. ప్రభుత్వం పశువులకు అత్యంత పోషకల విలువలు గల టీఎంఆర్ దాణాను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకొందని అందుకు కేజీ రూ. 6 చొప్పున కావాల్సిన రైతులు తప్పని సరిగా ఆర్బీకేలలో దరఖాస్తు చేసుకోవాలని రైతుల వద్దకే దానిని పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయం రైతులు గమనించాలని పశువైద్యాధికారి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు టంగుటూరి వెంకటరావుయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు మర్రి వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సాయికుమార్

దొనకొండ: స్థానిక సచివాలయం 1 ను కనిగిరి డివిజన్ డీఎల్‌డీఓ సాయికుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ విజిట్‌లో భాగంగా సచివాలయం 1 పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. గైర్హాజరైన సచివాలయ సిబ్బందిని చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి వి.వసంతరావు నాయక్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్ పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

మార్కాపురం: ఈ నెల 13న మార్కాపురం కోర్టు సముదాయంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ఆరో అదనపు ఇన్‌చార్జి న్యాయమూర్తి రాజావెంకటాద్రి తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు.

చిన్నకంభంలో వైద్య శిబిరం

కంభం: మండలంలోని చిన్న కంభం గ్రామంలో గురువారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ రసూల్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డా. రామాంజనేయులు ఆధ్వర్యంలో 102 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రభాకర్, నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో ఈ నెల 13వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిసున్నట్లు మార్కెట్ ఎగ్జిక్యూటి పి కాలేషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం ఒంగోలు కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాల ఎముకలు, కీళ్లు, నరాలు, కంటి చూపు, గుండె, గ్యాస్ట్రబుల్, సాధారణ వ్యాధులు చూస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా షుగరు, బీపీ, ఈసీజీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



నాభిశిలకు పూజలు చేస్తున్న భక్తులు

బల్లికురవ: బల్లికురవలోని గ్రామ దేవత పోలేరమ్మ కొలుపులు వారం రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. డప్పు వాయిద్యాలతో ఇంటింటా తిరుగుతూ సద్ది సేకరించి అమ్మవారి వద్ద నివేదించారు. గ్రామ కూడలిలోని నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మహిళలు ప్రార్థించారు. ఆదివారంతో కొలుపుల వేడుకతో ముగియనున్నాయి.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని ఒందుట్ల బృగుమహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో శ్రీకృష్ణుడు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, గణపతి పూజ, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



పంచముఖ ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో నాగులపుట్ట వీరాంజనేయస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి తమలపాకులతో ఆకు పూజ, పంచామృతాభిషేకం, నిర్వహించారు. అర్చకులు నారాయణం త్రివిక్రమ ప్రసాద్, రాఘవాచార్యులు స్వామివారికి సహస్ర నాగవల్లీ దళార్చన పూజ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

14న హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న ఆంజనేయాస్వామి గుడి నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శిరసనగండ్ల శ్రీనివాసులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో గురువారం శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఈశ్వరరెడ్డి, లక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నకుమారి, చెంచిరెడ్డి, గీతాంజలి దంపతులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా నిత్యం రామనామ సంకీర్తనలు ఆలపిస్తున్నారు. శుక్రవారం సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెంకటరామకృష్ణాచార్యులు, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.



శ్రీవారి కల్యాణంలో ఉభయదాతలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆ భూమిని యానాదులకే ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

దర్శి: యానాదులు సాగుచేసుకునే భూమిని యానాదులకే ఇవ్వాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితులు గురువారం ధర్నా చేశారు. మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందినయానాదులు గ్రామ సర్వేనంబరు 1071 లో ఎ6.50 సెంట్ల భూమిలో ఎకరాలు సాగుచేసుకుంటున్నారని రాష్ట్ర దళితసేన దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్‌కుమార్ తెలిపారు. నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పుకళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవిందప్రసాద్ మాదిగ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి యానాదులు సాగుచేసుకుంటున్నారన్నారు. అయితే ఆ భూమికి ఎలాంటి సంబంధం లేని మానికొండ రామకృష్ణ ఎస్సీలను అడ్డుపెట్టుకుని ఆక్రమించే ప్రయత్నంలో ఎస్సీ, ఎస్టీలకు మధ్య చిచ్చు పెట్టి ఆ భూమిని రెవెన్యూ పెద్దలతో కుమ్మక్కై ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి జి. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గతనెల 29న ఎస్టీ కార్పొరేషన్ జిల్లా ముఖ్య అధికారి జగన్నాథరావు జీఓలో యానాదులు సాగుచేసుకునే భూమిని యనాదులకే ఇవ్వాలని కోరారు. ఆభూమిని ఆక్రమించిప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు వచ్చి 12 రోజులు కావస్తున్నా రెవెన్యూ అధికారులు ఈరోజు వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ మాట్లాడుతూ వారంరోజుల్లో ఆ భూమిని పరిశీలించి విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కె. మార్కు, గట్టుపల్లి ప్రసాదు, గుంటూరు ఏసుదాస్, గర్నెపూడి ప్రభాకర్, బండి రామాంజనేయులు, ఏకశిరి ఆంజనేయులు, బాధిత మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



ఉపాధి అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ముండ్లమూరు: మండలంలోని బృందావనం తండా పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో జరిగిన అక్రమాలపై ఎంపీడీఓ కె. కుసుమకుమారి గురువారం విచారణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మండల పరిషత్ సమావేశంలో అక్రమాలు జరిగాయంటూ సభలో పలు అక్రమాలపై నిలదీశారు. దీంతో ఎంపీడీఓ, ఏపీడీ పద్మశ్రీ, ఏపీఓ కొండయ్యతో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. నేతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీకి క్షేత్రసహాయకుడు లేకపోవడంతో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. వలస వెళ్లిన వారికి మస్టర్లు వేయడం, పనులకు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్న మరి కొంత మందికి మస్టర్లు వేసి కేలి నగదును చెరి సగం పంచుకుంటున్నందున కూలి గిట్టుబాటు కావడంలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మీ పంచాయతీకి క్షేత్ర సహాయకుడిని నియమించి మీ పర్యవేక్షణలో మేట్‌లను నియమించుకొని పనులు చేసుకొనేలా చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కంభం: ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించేలా చూడాలని ఉపాధి హామీ పీడీ కె. శీనారెడ్డి అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీడీఓ నర్సయ్య, ఏపీడీ భాస్కర్, ఏపీఓ ఏడుకొండలు, యస్.ఆర్.పి సుబ్బారావు, తులశీ నాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం తెలిపిన బూచేపల్లి

దర్శి: మండలంలోని పోతవరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ మునగాల కృష్ణారెడ్డి అనారోగ్య కారణంతో గురువారం మృతి చెందారు. తిమ్మాయపాలెంలోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని దర్శి మాజీ శాసన సభ్యుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఈఈగా మర్దన్ అలీ



మర్దన్ అలీ

పొదిలి: ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈగా షేక్ మర్దన్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న విశ్వనాథరెడ్డి సెలవుపై వెళ్లటంతో ఆయన స్థానంలో మర్దన్ అలీ బాధ్యతలు చేపట్టారు. మర్దన్ అలీని అధికారులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయాలతో మరింత విజ్ఞానం



విద్యార్థులతో నీతి కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్



అద్దంకి: వేసవి శిక్షణ తరగతుల్లో విదార్థులు

చీరాల అర్బన్: విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ డి.ధనమ్మ అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పిల్లలతో నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, సుమతీ శతకాలు, ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలు చదివించారు. అనంతరం క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే శిబిరంలో విద్యార్థులందరూ పాల్గొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. శిబిరంలో 26 మంది విద్యార్థులు హాజరయ్యారు.

యోగా శిక్షణ తరగతులు..

అద్దంకి రూరల్: అద్దంకి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం యోగా నేర్పించారు. తదుపరి కథలు చెప్పడం, ఇంగ్లిషు గ్రామర్ బోధించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చుండూరు సుగుణరావు, తాళ్లూరి బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వచనం

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు టీవీఎస్‌పీ శర్మ, మహాలక్ష్మి దంపతుల కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు గురువారం హాజరయ్యారు. నూతన దంపతులు సాయి ప్రియాంక, నరసింహ శర్మ దంపతులను ఆశీర్వదించారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడిచేసి గాయపరచిన వారిపై కేసు

చినగంజాం: ఇరువురిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సురేష్ వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం పంచాయతీ బుచ్చిగుంట గ్రామానికి చెందిన నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లపై ఈనెల 9వ తేదీ రాత్రి శేషయ్య, మరియదాసు, అనిల్, వినోద్‌లు దాడి చేశారు. గ్రామంలో సిమెంట్ బల్లను నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లు తీసుకొని వెళ్లి వారి దుకాణం వద్ద వేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన ఆ నలుగురు బల్ల తీసుకొని వెళ్లి మీరు వేసుకుంటారా అంటూ వాదనకు దిగి వారిపై దాడి చేసి గాయపరచారు. దాంతో బాధితులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తోందని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి తెలిపారు. 21 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, కథలు చెప్పించడం, చదివించడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తునట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరానికి పంపాలని కోరారు.



కథ చెబుతున్న విద్యార్థిని

18 ఏళ్లు నిండితే చాలు ఓటు హక్కు

చీరాల: 18 సంవత్సరాలు నిండిన వారు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు కార్డుకు దరఖాస్తు చేసుకుని ఓటు కార్డును పొందాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల గుర్తింపు కార్డులు, క్లెయిమ్స్ వెరిఫికేషన్ కోసం బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. అలానే పట్టణంలో ఓటు కార్డు లేనివారు సమీపంలోని పోలింగ్ బూత్‌కు వెళ్లి సంప్రదించాలన్నారు. బీఎల్‌వోల వద్దకు వచ్చిన అప్లికేషన్లను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలన్నారు. పట్టణంలో 66 పోలింగ్ స్టేషన్లు, 66 మంది బూత్ లెవల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. బీఎల్‌ఓలపై పర్యవేక్షణకు ఎనిమిది మంది సూపర్‌వైజర్లును కార్యాలయం నుంచి నియమించి ఒక్కొక్కరికి 10 మంది చొప్పున కేటాయించామన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని ప్రధానమైన కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. ఎస్సై మల్లికార్జున ఉన్నారు.



స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

వాసవీ కుటుంబ రక్ష పథకం ద్వారా ఆర్థిక సాయం

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో వాసవీ కుటుంబ సురక్ష పథకం ద్వారా ఇంకొల్లుకు చెందిన కూనిశెట్టి నాగరాజుకు గురువారం అద్దంకిలోని వాసవిక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ నివాసంలో రూ. 3.40 లక్షలు చెక్ అందజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు క్లబ్ జోన్ చైర్మన్ దొగిపర్తి అప్పయ్య, ఊటుకూరి శ్రీనివాసరావు, చుండూరి సాంబశివరావు, ఆత్మకూరి ఆంజనేయులు, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూరిత వాతావరణం

చీరాల రూరల్: క్రీడలు స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొంఇస్తాయని, క్రీడలలో నైపుణ్యం సాధించిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలను పొందుకున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు సౌజన్యంతో సతీష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లాస్థాయి రెడ్ టెన్నిస్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర సౌష్టవానికి ఎంతగానో ఉపయోగపడతాయని, యువకులు చెడు మార్గంలో నడవకుండా సన్మార్గంలో క్రమశిక్షణతో నడిచేందుకు దోహదం చేస్తాయని చెప్పారు. పోటీల నిర్వహకులు డి. సతీష్, డి. రాబిన్‌లు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 25 జట్లు పోటీ పడుతున్నాయని చెప్పారు. పోటీలో విజేతలుగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతిగా రూ. 15,000 రెండో బహుమతిగా రూ. 10,000 మూడో బహుమతిగా రూ. 7000 అందించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహకులు మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మల్లెల లలితా రాజశేఖర్, ఫుట్‌బాల్ కోచ్ బొనిగల ప్రేమయ్య, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వివాదాలతో జీవితం అంధకారం

యద్దనపూడి: వివాదాలతో జీవితం అంధఃకారం చేసుకోవద్దని బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అర్ధరాత్రి మార్టూరు గ్రామంలోని సూర్య దాబా వద్ద జరిగిన ఘర్షణ నేపథ్యంలో గురువారం సాయత్రం డీఎస్పీ మండలంలోని పోలూరు, యద్దనపూడి, చింతపల్లిపాడు గ్రామాల్లో పర్యటించారు. ఘర్షణకు సంబంధించిన ఇరువర్గాలు యద్దనపూడి మండలంలోని వారే కావటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా దాడికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్సై అనూక్, రైటర్ ఆంజనేయులు, ఏఎస్సై శేషసాయి ఉన్నారు.




స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

బత్తాయి తోట పరిశీలన

దొనకొండ: మండలంలోని మల్లంపేటలో రైతులు సాగు చేసిన బత్తాయి తోటలను కృసి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డా.శివ, వాతావరణ శాస్త్రవేత్త కాశీనాథ్ గురువారం బత్తాయి తోటలను సందర్శించి సూక్ష్మ పోషకాలు, ఎండు తెగులును గమనించడం జరిగింది. వాటి నివారణకు సూక్ష్మ పోషకాలను సవరించడానికి అగ్రో మోనాక్స్ 4 కేజీలు లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. అలాగే బత్తాయి ఎండు తెగులు నివారణకు ట్రికోడెర్మా శిలింద్రంలో కలిపిన పశువుల ఎరువు చెట్టు వయస్సును బట్టి 5–10 కేజీలు తీసుకుని బోర్డో పేస్టు లేదా బోర్డో మిశ్రమాన్ని 1 శాతం ద్రావణాన్ని మొక్క మొదలు తడిచే విధంగా వారానికి ఒకసారి వేరు వ్యవస్థ తడిచే విధంగా బాగా తడపాలి. రైతులకు మంచి దిగుబడి పొందేందుకు సూచన, సలహాలందించారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కారంచేడు: సంక్షేమ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు–3 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రైతులకు, విద్యార్థులకు అవసరమైన అర్జీల పరిష్కారంలోను సిబ్బంది ముందుండాలన్నారు. వారి నుంచి స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరవ్వడంతో పాటు, యూనీఫాంను దరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అరుణ, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న తహసీల్దారు

వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి

పుల్లలచెరువు: వాహనదారులు తప్పని సరిగా ప్రభుత్వం నిర్దేశించిన పత్రాలను కలిగి ఉండాలని పుల్లలచెరువు ఎస్ఐ శ్రీహరి వాహనదారులకు సూచించారు. గత మూడు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాహనదారులకు తప్పని సరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, చిన్న పిల్లలకు ట్రాక్టర్లు, మోటార్ వాహనాలు ఇచ్చినట్లుగా ఉంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని వాహనదారులకు అవగాహన కల్పించారు. కూలీల ఆటోలు అధిక లోడు, మితిమీరన వేగంగా వెళ్లరాదని సూచించారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు.